# అభిమానం

**బ**జార్లోంచి వీధి తలుపుగుండా తన్నిన బంతికిమల్లే గెంతుకుంటూ పుస్తకాల సంచితో వరండాలోకి వచ్చి దూకాడు చంద్రుడు.

రోజూ సాయంత్రం చంద్రుడు బడి నుంచి యింటికివచ్చి, పుస్తకాలసంచీ యింట్లోపారేసి, ఆటలకు వెళ్ళేసమయానికి వరండాలో అమ్మ సీతకు జడ వేస్తూండేది. తనకింకా బడి యోగ్యత పట్టలేదు గనుక చంద్రుణ్ణి చూడంగానే జడ వేయించుకుంటున్న సీత, చంద్రుడు బడికి వెళ్ళినప్పటినుండి జరిగిన సంఘటనలు జడ కుదరనీయకుండా తలా చేతులూ తిప్పుతూ గుక్క తిరక్కుండా ఏకరువుపెడ్తుంటే, అమ్మ ఆ వొక్క నిమిషంలో కొంపలంటుకుని కప్పులు మీదపడ్డంత గొడవచేసే సమయంలో–సీతను బుగ్గలు గిల్లుతూ పరామర్శించి, పుస్తకాల సంచీని వదిలించుకుని చంద్రుడు బయటపడేవాడు యీలలు కొట్టుకుంటూ.

"సీతా!" అంత దూకుడుమీద వచ్చిన చంద్రుడు వూపు ఆపుకుంటూ అట్లాగే నిల్చునిపోయాడు వరండామూల నక్కుకుని కూచున్న సీతను చూసి.

"ఎందుకే అట్టా కళ్ళు రుద్దుకుంటున్నావ్–" చప్పున వచ్చి సీత పక్కన కూచున్నాడు చంద్రుడు.

"వూం–ఫో–"

"ఎందుకే, ఎందుకే– చెప్పవుకదూ–ఎందుకే ఏడుస్తున్నావూ?"

"వూం–వూం–," ఎక్క సాగింది సీత.

"అదుగో అందుకే– మా అమ్మగదూ–ఏమే, వాళ్ళ కిష్టాయ్ కొట్టాడా?"

'అమ్మ–అమ్మకొట్టింది–వూం–వూం–"

"అమ్మేగదా–యింకా కిష్టాయ్‌గాడేమోననుకున్నా."

"ఫో–ఫో–ఎందుగ్గొట్టాలేం వుత్తపున్నానికే–వుహుం–వుహుం–" తగిన సానుభూతి పొందని సీత ఒక్కసారి బావురుమంటూ కాళ్ళతో చంద్రుణ్ణి తన్నటం మొదలుపెట్టింది.

"ఎందుకే– ఎందుకమ్మా నన్ను తంతావూ–నీకు బిళ్ళలు కొనిపెడ్తాగా– అమ్మను

కొద్దాంలే–ఎందుగ్గొట్టిందీ అమ్మ, సీతా?" బుజ్జగిస్తూ సీతను దగ్గరకు లాక్కున్నాడు చంద్రుడు.

"వుత్తపున్నానికి కొట్టింది పాపం వూఁ–వూఁ–"

"మరి నువు అల్లరి చేశావా?'

"ఎప్పుడూ అల్లరేనమ్మా పాపం–"

"మరేంజేస్తే కొట్టిందే?"

"మరే నే నేమో– యిందాకేమో– ఆ పొయి దగ్గర అమ్మ వీపుమీద అనుకుంటేనూ– చూడమ్మా ఎట్టా కొట్టిందో నెత్తు రొచ్చేట్టూ–" వొంగి వీపు మీద గౌనులాగి చూపింది.

ఒక్క క్షణం తల దిమ్మరపోయింది చంద్రుడికి, సీత వీపు మీద కమిలిపోయిన అయిదువేళ్ళూ చూసేసరికి. అమ్మ యింత దెబ్బ కొడ్తుందని చంద్రునికి మొదటిసారి తెలిసింది.

"అమ్మో! ఎందుకొట్టిందే యిట్లా!"

"చెప్పలేదయ్యా–వుత్తినే–వూఁ–వూఁ–" ఒక్కసారి కొత్తబాధ. ముంచుకొచ్చింది సీతకు.

"అమ్మేదే? –"

"దొడ్లో వుంది–పాపం–"

"ఈ అమ్మ యిట్లా కొడుతుందేం–!" అనుకున్నాడు చంద్రుడు పెద్దగా.

* * *

రాత్రి పదింటికి యింటికివచ్చి నాన్నే అన్నం పెట్టుకుంటున్నాడు. అమ్మ దొడ్డిగుమ్మంలో కూచుని చీకట్లోకి చూస్తున్నది. రోజూ అమ్మా నాన్నా యిద్దరూ కలిసి అన్నం తినేవాళ్ళు....

"అమ్మ అన్నం తింటం లేదెందుకో!" అనుకున్నాడు చంద్రుడు.

"నాన్న అమ్మను కొట్టాడ్రా" అన్నది చంద్రుడి పక్కలో సీత. వెంటనే చంద్రుడు తెలుసుకున్నాడు. సీత యివాళ తొందరగా నిద్రపోవటానికి అవకాశం లేదని.

"పెద్దగా అరవబోకే–యింకా నీవు నిద్రపోయినావనుకున్నా–"

"నిజంగానా, నాన్న అమ్మను కొట్టాడు–నే చూశారా–అబ్బ–అమ్మ ఎట్టా ఏడ్చిందనుకున్నా–" చప్పున సీత నోరుమూశాడు చంద్రుడు వొక్కక్షణం.

వంటింట్లో అన్నపు గరిటె గిన్నెకు తగిలి ఖంగ్‌మంది. అమ్మ అట్లాగే కూచుంది.

"ఎందుక్కొట్టాడే?" అన్నాడు చంద్రుడు, యింకొంచెం సీత దగ్గరకు జరిగి, గొంతు వెలుగురాచుకుపోయిన స్థాయిలో సంభాషణ సాగిస్తూ.

"మరే, అమ్మే, చీరె తీసుకురమ్మంది నాన్నని."

"ఏం చీరే?"

"కొట్టోంచి కొత్తచీరెరా!"

"ఈ అమ్మకు ఎప్పుడూ చీరెలుండవు!"

"అమ్మకు కాదురా అన్నాయ్ చీరే!"

"మరి ఎవరికే?"

"మనత్తయ్య వొస్తుందిట్రా!"

"ఎవరూ-కనకమ్మత్తయ్యా?'

"ఆఁ."

"ఒస్తే-?"

"అమ్మ అత్తయ్యకు చీరె కొంటుందిట!"

"అమ్మో! ఆ అత్తయ్యకు చీరెలు కావాల్సిందే! మరి కొన్నదిగా ఆ అత్తయ్యకారూ!"

"మనం ఎక్కొద్దుట్రా అన్నాయ్ కారూ - మరే - నేనే - చక్రం తిప్పి పుఁయ్ మనిపిస్తా-" ఒక్కక్షణం సీత నోటిమీద చంద్రుడి అరచెయి ఆగింది.

"దాని కారెక్కావంటే నీ చెవులు పిండుతా సీతాం."

"ఏంట్రా అన్నయా - మనత్తయ్యది కాదమ్మా కారూ?"

"ఉన్నదిలే బొంబోడి కారు దీనికే! నేను పెద్దవాణ్ణయితే స్టీమరంత కారు కొంటా!"

"స్టీమరంటే ఏంట్రా అన్నాయ్?"

"అబ్బో అది కొండంత వుంటుంది!"

"అబ్బ!"

"మహా గొప్ప-టుప్పాయి కారు!"

"అన్నాయ్?"

"ఏంటే?"

"మరి నువు తెల్లవారి పెద్దవాడివవుతా?"

"ఛా-తెల్లవారంటే రేప్పొద్దున్నే గాదుటే?"

"మరి ఎన్ని తెల్లవార్లకు పెద్దవాడి వవుతా?"

"పోవే నీకేం తెలియదూ- మరి నాన్నంత పెద్దవాణ్ణయితే, అప్పుడూ."

"నాన్నంత పెద్దవాడి వవుతే-అప్పుడు అమ్మను కొట్టవుట్రా?"

"ఛీ అట్లా అంటే కళ్ళు పోతయ్యేవ్ సీతాం. మనమ్మ మంచిది!"

"మరి నన్నెందుకొట్టిందమ్మా?"

"మంచమ్మ కొడ్తే ఏమ్మా!" సీతాం వీపు ఎందుకు వాతతేలిందీ తెలుసుకుంటానికి అట్టేసేపు పట్టలేదు చంద్రుడికి.

"ఆఁ!"

"మరి కనకమ్మత్తయ్యకు చీరె తెమ్మంటే నాన్న అమ్మను కొట్టాట్టే?"

"అహాఁ-అప్పుడే కొట్టలా!"

"మరెప్పుడూ?"

"చాలాసేపయినాక కొట్టాడు"

"ఎందుకనే చాలా సేపయినాక కొట్టిందీ?"

"మరే, నాన్న డబ్బు లేదంటుంటే అమ్మ చీరె తెమ్మంటున్నదీ- మరెట్లా!"

"ఈ అమ్మ ఎప్పుడూ యింతే- అసలే నాన్న దగ్గిర డబ్బు లేదంటుంటే."

"మరే-'నే దరిద్రుణ్ణే' అని యిట్లా తలకాయ పట్టుకుని అన్నాడ్రా నాన్నా?"

"అసలెందుకో యీ కనకంకు చీరే!"

"మరి నాన్న దగ్గిర చాలా కాన్లున్నయి గదుట్రా?"

"ఎక్కడయినా కానీలకు కొత్తచీరె వొస్తుందిటే సీతాం?"

"రాదుట్రా?"

"అస్సలాదు."

"మరి నా దగ్గిర రెండు మూడు కాన్లున్నయ్యే-"

"బిళ్ళలు కొనుక్కుందాంలే."

"అమ్మ నీకుమల్లే పుత్తకాలు కొనుక్కోమందిరా ఇన్ని పదికాన్లయినాకా! మరే, నేనే, పరికిణీ కొనుక్కుంటానంటే సరే దాచుకోమందిరా. అన్ని కాన్లుంటే పరికిణీ వస్తుందిట్రా అన్నాయ్?"

"సరేలే, నేను కొట్లో కనుక్కుంటాలే."

"అన్నయ్యా- మన కనకమ్మత్తయ్య గొప్పదిట్రా?"

"ఎవరన్నారే?"

"మరే, అమ్మేమన్నదంటే నాన్నతో 'మీ చెల్లెలు వాళ్లు గొప్పవాళ్ళు-సిగ్గేస్తుంది' అన్నదిరా!"

"అసలీకనకమ్మత్తను పంగలకర్రతో కొట్టాలి!"

కనకమ్మత్తను చూస్తే సిగ్గేస్తుందట్రా అన్నాయ్?"

"అమ్మకు సిగ్గేస్తుంది!"

"నీకో?"

"చచ్చినా వెయదు."

"మరి అమ్మకు ఎందుకేస్తుందిరా సిగ్గూ?"

"వూరుకోవే నీకు తెలియదుగానీ-"

"ఎందుకు తెలియదమ్మా-"

"సీతాం?"

"ఏంట్రా అన్నాయ్?"

"కనకమ్మత్తయ్య ఎప్పుడొస్తుందే?"

"వుత్తరం రాసిందట్రా చెన్నపట్ణం పోతూ యిక్కడ దిగి పోతానని.'

"అది మంచిది కాదే."

"ఏదిరా?"

"కనకమ్మత్త."

"ఎందుకన్రా?"

"పిసినారి."

"అంటే ఏంట్రా అన్నాయ్?"

"నీకు బిళ్ళలు కావాలని ఏడుస్తుంటే ఒక్క కానన్నా యియ్యదు."

"కనకమ్మత్తయ్య దగ్గర చాలా కాన్లున్నయ్యా?"

"అబ్బో వాళ్ళింట్లో గోతాల్నిండా వున్నాయి."

"మరి ఒక్క కానన్నా యియ్యదుట్రా బిళ్ళలు కొనుక్కొంటానికీ?"

"యియ్యదు."

"ఆc! మరి అమ్మ కనకమ్మత్తయ్యకు ఎందుకు చీరె కొనాలమ్మా?"

"కనకమ్మత్తయ్యకు చాలా డబ్బుందిగా! మరి మనమ్మక్కూడా చాలా డబ్బుందని చూపించి గొప్ప చెప్పుకుందామని."

"అట్లా ఎందుకురా అమ్మ అంటుంది అన్నాయ్! మరి నాన్న డబ్బుల్లేవన్నాడుగా!"

"నా పుస్తకాలకే డబ్బుల్లేవు నాన్న దగ్గర."

"నా పరికిణీకోమ్మా?"

"లేవమ్మా."

"అయితే కనకమ్మత్తయ్య మనింటికొద్దు"

"ఒస్తే రానీ-"

"ఎవరు కొనిపెడ్తాడేం- అసలీ కనకమ్మత్తయ్య బోలెడన్నిసార్లు కాఫీలు తాగుతుంది- అంత కాఫీపొడి తెప్పించిందిరా- ఎవ్వర్తో చెప్పద్దంది."

"ఎక్కడివే అమ్మకు అన్ని కాన్లు సీతా?"

"కిష్టాయిగారమ్మ దగ్గిర తెచ్చిందిరా! మళ్ళీ నాన్న దగ్గిర తీసుకునిస్తాననీ."

"నాన్నకు తెలుస్తే చంపడూ!"

"మళ్ళీ గొడ్తాడా నాన్న అమ్మనూ!"

"ఈ అమ్మకేం తెలియదు-"

"ఎట్లా-!"

"స్- అరవకే నాన్న చెయి కడుక్కుంటున్నాడూ-"

"అమ్మ అన్నం దిన్లేదురా అన్నాయ్."

"తిన్లేదే సీతాం-అరవకు-"

అర్ధరాత్రి అమ్మ వంటింటోనించి మూతి తుడుచుకుంటూ నాన్న గదిలోకి పోవటం చూసింది సీత.